క్లుప్తంగా

బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



నెహ్రూనగర్: బీసీ సమస్యల పరిష్కారానికి బీసీ కమిషన్ చైర్మన్ కృషి చేయాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ బీసీ ఓబీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ పావులూరి హనుమంతరావు పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్ పర్యటనపై నేపథ్యంలో శుక్రవారం అరండల్‌పేటలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ కమిషన్ చైర్మన్ పర్యటన గురించి బీసీ సంఘాలకు అన్నింటికీ తెలియజేయాల్సిన బాధ్యత బీసీ కమిషన్‌కి ఉందని చెప్పారు. అనధికారిక కార్యక్రమాన్ని అధికారిక కార్యక్రమంగా మార్చి కేవలం కొంతమంది బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి నామమాత్రంగా నడపటం సమంజసం కాదని హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు బాబ్జి నంద, ప్రజాపతి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అతిగా వినియోగిస్తే అనర్థాలే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారని, సెల్‌ఫోన్‌ను అతిగా వినియోగిస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని గుంటూరు జీజీహెచ్ రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.విజేత అన్నారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో మీ కోసం– మేము అనే కార్యక్రమంలో భాగంగా రోగులతో వైద్యులు, ఆస్పత్రి అధికారులు సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. చాలా మంది ఫోన్‌లకు అతుక్కుపోయి క్షణం ఫోన్ చూడకుండా ఉండలేని విధంగా వ్యసనంగా మారిందన్నారు. ఇలా సెల్‌ఫోన్‌కు నిత్యం అతుక్కుపోతే అయితే శారీరక, మానసిక సమస్యలు వస్తాయని చెప్పారు. కొంత మంది రాత్రి వేళలో నిద్ర పోకుండా గంటల కొద్ది ఫోన్‌ను చూస్తూంటారని, బెడ్‌రూమ్‌లో ఫోన్‌లు పెట్టుకుని ఎక్కువ సేపు ఉంటే రేడియేషన్ సోకే ప్రమాదముందని హెచ్చరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ జీజీహెచ్‌లో నూతన సెక్యూరిటీ విధానం ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ నూతన పాలసీ ప్రకారం రోగి సహాయకులకు తప్పనిసరిగా అటెండర్ పాస్ ఉండాలని చెప్పారు. జాగతి సేవ సంస్థ ప్రతినిధి నాగరాజకుమారి రోగులకు ఉచితంగా మల్టీ విటమిన్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్‌సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బుజ్జా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలకు ఊతం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టి చారిత్రక విజయాన్ని అందుకుని భూమిపైకి విజయవంతంగా చేరుకున్న శుభాంశు శుక్లా ప్రస్థానం అంతరిక్ష పరిశోధనలకు మరింతగా ప్రోత్సాహాన్ని ఇచ్చిందని చిల్డ్రన్స్ స్పేస్‌క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజులు తన బృందంతో కలిసి గడిపిన శుభాంశు శుక్లా క్షేమంగా భూమికి చేరుకోవడం మంచి పరిణామమని, ఇస్రో, నాసా సంయుక్తంగా చేస్తున్న పరిశోధనలు అంతరిక్షంలో మానవ మనుగడకు దోహదపడుతున్నాయని అన్నారు. భారతదేశం నుంచి అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు ఇస్రో చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

ఉద్యమంలా చేతిరాత నైపుణ్య శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. గుంటూరుజిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులతో ఏర్పడిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో కుప్పంలోని ద్రవిడ విశ్వ విద్యాలయంలో పీజీ, పరిశోధక విద్యార్థులకు ఈనెల 14,15వ తేదీల్లో 127వ క్యాలిగ్రఫీ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందం శుక్రవారం డీఈవోతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా క్యాలిగ్రఫీ శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన అంశాలను ఆమెకు వివరించారు. ఈసందర్భంగా డీఈఓ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు విద్యార్థుల చేతిరాతను మెరుగుపరచేందుకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లి, వందలాది మంది ఉపాధ్యాయులను చేతిరాత నైపుణ్యంలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో క్యాలిగ్రఫీ టీం సభ్యులు ఉప్పాల రామ్మోహనరావు, అనిల్‌కుమార్, షాజీర్, అన్నపూర్ణ, సత్యనారాయణ, బురాన్, ఆదినారాయణ, రవికుమార్, రమాదేవి పాల్గొన్నారు.



చౌత్రాసెంటర్ చిన్నబజార్ వద్ద చెత్తచెదారం



పొన్నూరురోడ్డు ఎస్ఎం లాల్‌జాన్ మెమోరియల్ చిల్డ్రన్స్ పార్క్ వెనుక రోడ్డులో దుస్థితి



బారాఇమాంపంజా రోడ్డులో వ్యర్థాలు

• ‘చెత్త’ వీధులు

చెత్తపై చిత్తశుద్ధి లేదు. నగరంలో చెత్త నిర్వహణకు అవార్డులు వస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో మెరుగు కనిపించడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది చేసిన తప్పే తరుచూ చేస్తున్నారు. వీధుల్లో చెత్త దర్శనమిస్తోంది. చౌత్రాసెంటర్ చిన్నబజార్ వద్ద చెత్త చెదారం పేరుకుపోయింది. రైతుబజార్ సమీపాన ఉండటంతో కూరగాయాల వ్యర్థాలను తీసుకొచ్చి అక్కడే పడవేస్తున్నారు. బారాఇమాంపంజా రోడ్డులోనూ మరింత దారుణంగా తయారైంది. పొన్నూరురోడ్డులోని జనాబ్ ఎస్ఎం లాల్‌జాన్ మెమోరియల్ చిల్డ్రన్స్ పార్క్ వెనుక రోడ్డులో నిలిచిన చెత్త చెదారాన్ని తొలగించడంలేదు. ట్రాక్టర్లతో క్రమం తప్పకుండా చెత్త సేకరిస్తే ఈ పరిస్థితి ఉండదని స్థానికులు చెబుతున్నారు.

– నగరంపాలెం

కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



స్కానర్‌లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, నాయకులు

పట్నంబజారు: ప్రజలను నిలువునా వంచించిన కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం 11, 54 డివిజన్‌ల నేతలతో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పార్టీ అధిష్టానం సూచించిన స్కానర్‌ను ఏవిధంగా వినియోగించాలనేది పార్టీ శ్రేణులకు వివరించారు. నూరిఫాతిమా మాట్లాడుతూ అమలు కాని వాగ్దానాలు ఎన్నికల సమయంలో ఇచ్చి ప్రజలను మోసం చేసిన నీచ చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలను వివరించి, కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనను తెలియజెప్పాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్యవంతుల్ని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దాసు, అగ్గిపెట్టిరాజు, రాజేష్, కార్పొరేటర్ రమ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

లాలాపేట సీఐ శివప్రసాద్



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యార్థి దశలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని లాలాపేట సీఐ ఏవీ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన కేబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ ప్రాధాన్యం కలిగిన అంశంగా భావించాలని అన్నారు. మైనర్లు సోషల్ మీడియాకు దూరంగా ఉండటంతో పాటు ద్విచక్ర వాహనాలు నడిపేందుకు అవకాశం ఇవ్వరాదని తెలిపారు. విద్యార్థి దశలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ప్రమీలాకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నాయకులను ఎన్నుకునే విధానం, ఎన్నికైన నాయకులకు ఉండాల్సిన విలువలు, విశ్వసనీయత, ప్రజల ఆశయాలను నెరవేర్చే విధి, విధానాలను విద్యార్థి దశలోనే నేర్చుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తద్వారా మంచి నాయకులుగా ఎదుగుతారని తెలిపారు. చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఆర్‌జీఎం శ్రీనివాసులురెడ్డి, ఏజీఎం జానకి రామిరెడ్డి, కో–ఆర్డినేటర్లు ఆర్ఎస్‌టీ శ్రీని, ఎస్ఎస్‌టీ అనుపమ, ఏవో రాకేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- 10లక్షల మందిలో ఒకిరికి వచ్చే అరుదైన ట్యూమర్
- ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడిన జనరల్ సర్జరీ వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ జి. కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: ప్రతి పది లక్షల మందిలో ఇద్దరు లేదా నలుగురికి మాత్రమే అత్యంత అరుదుగా వచ్చే ట్యూమర్‌కు గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం జనరల్ సర్జరీ వైద్య విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను జనరల్ సర్జరీ నాలుగో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కిరణ్‌కుమార్ మీడియాకు వెల్లడించారు.

గుంటూరుకు చెందిన 28 సంవత్సరాల జీవన్ స్రవంతి రెండు సంవత్సరాల క్రితం మూడు నెలల గర్భిణిగా ఉన్నపుడు బొడ్డుపై హెర్నియాకి ల్యాప్రోస్కోప్ ద్వారా ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయుంచుకున్నట్లు చెప్పారు. ఆపరేషన్ తరువాత రెండు నెలలకు పొట్ట మీద కణిత వచ్చి, అది క్రమేపీ పెరిగి పెద్దది అవుతుండడంతో పలు ఆసుపత్రులు తిరిగి చివరకు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి గత నెలలో వచ్చినట్లు తెలిపారు. ఉదరంపై ఏర్పడిన డెస్మాయిడ్ ట్యూమర్‌కి ఆరు లక్షల ఖరీదు ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్యసేవ కింద రెండు వారాల క్రితం ఉచితంగా చేశామన్నారు. ల్యాప్రోస్కోప్, ట్యూమర్ వైడ్ లోకల్ ఎక్సిషన్ , కాంపోజిట్ మెష్ రిపేర్‌ను విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు. డెస్మాయిడ్ ట్యూమర్ క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందని చెప్పారు. రోగి తరచూ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఈ ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటుగా జనరల్ సర్జరీ వైద్యులు అరుణ, గీతిక, అక్షయ్, సత్యదేవ్ , రవి, పావని, వెంకటరమణ మత్తు వైద్యులు పోలయ్య, శాంసన్, సంతోష్ పాల్గొన్నట్లు వెల్లడించారు. అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడిన సర్జరీ వైద్యులను సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు.

• చెరువు కాదు.. రోడ్డే



స్థానిక అరండల్‌పేట 10/4వ అడ్డరోడ్డు అధ్వానంగా మారింది. లోతట్టు గుంతలపై రాకపోకలకు స్థానికులు, చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో గుంతలకు ప్యాచ్‌వర్క్ పనులైనా చేయించాలని పలుమార్లు విన్నవించిన పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో చేసేది ఏమిలేక రాకపోకలు చేయాల్సి వస్తోందని అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు గుంతలు కాస్త వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా కిందపడిపోవాల్సిందేనని చోదకులు ఆందోళన చెందుతున్నారు.

– నగరంపాలెం

కార్మికుల సమస్య పరిష్కరించకపోవడం అన్యాయం



సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల కనీస వేతన చట్టం అమలు చేయకపోవడం అన్యాయమని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు అన్నారు. గుంటూరు తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో చేపట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారానికి ఆరో రోజుకు చేరింది. సమ్మెకు కౌలు రైతు సంఘం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీఓలు ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జీఓలు ఇవ్వమని సంవత్సరం నుంచి కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం అన్యాయం అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు షోకాజ్ నోటీసులు, ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరింపులకు పూనుకోవటం తగదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా అధ్యక్షులు బి.రాజశేఖర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పోరాటాలు కొత్త కాదని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. ‘అడుక్కుంటే వచ్చేది బిక్షనీ... పోరాడితే వచ్చేది హక్కులని‘, ఆ హక్కుల కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని వివరించారు. మున్సిపల్ కార్మికుల పోరాటాలకు యూటీఎఫ్ నిత్యం అండగా ఉంటుందన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ గురువారం సీడీఎంఏ కార్యాలయం వద్ద ధర్నా సందర్భంగా అధికారులు రెండు, మూడు రోజులలో జీతాల పెంపు ప్రకటన చేస్తారని తెలియజేశారని, జీతాల పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, ఆర్.కాశయ్య, షేక్ బాషా, శ్రీకాంత్, జోసెఫ్, నాగరాజు, గాలి శ్రీనివాసరావు, సిద్దాబత్తిన శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఓగిరాల మహేష్, గాలి నరేష్, ఎం.మహేష్, ఆర్ముగం, సుబ్రహ్మణ్యం, బి.రవి పాల్గొన్నారు.

త్వరలో దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఎన్నికలు

నెహ్రూనగర్: శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు సమాజం అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి లక్ష్మీనారాయణ, మేడూరి శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం అరండల్ పేట శ్రీ విరాట్ విశ్వకర్మ సామాజిక ప్రాంగణంలో సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు నిర్వహణకు ముఖ్య ఎన్నికల అధికారిగా వినుకొండ ప్రసాదరావును, సహాయకులుగా గోనుగుంట శేషగిరిరావు, చామర్తి శంకర శాస్త్రి, కూరపాటి కామాక్షి శర్మ, సిద్దు చిరంజీవాచారి, ఆలూరు శ్రీనివాస్, సిద్దు సాంబశివరావులను నియమిస్తూ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందని చెప్పారు.

నేడు అవగాహన కార్యక్రమం

నెహ్రూనగర్: ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులు, జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్న లబ్ధిదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు రెవెన్యూ కళ్యాణ మండపంలో(కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

21న చలో డీజీపీ కార్యాలయం

నెహ్రూనగర్: రజక మహిళ తోరటి అనూష మృతిపై విచారణ జరపాలని కోరుతూ ఈ నెల 21న చలో డీజీపీ కార్యాలయం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రజక వృత్తి దోభీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కాలనీలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 13, 2025న గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిన రజక మహిళ అనూష అనుమానాస్పద మరణంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ డీజీపీకి వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.అనూష తల్లీ సామ్రాజ్యం మాట్లాడుతూ భార్యని అడ్డుతొలగించుకోవాలనే పథకం ప్రకారం దారుణానికి పాల్పడినట్లు ఆరోపించారు.

22న జంతుశాస్త్ర బోధన పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతుశాస్త్రాన్ని బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 22వ తేదీ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీలో 55 శాతం మార్కులు కనీస అర్హతతో పాటు నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలుగా ఉన్న అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. సంబంధిత అర్హతలు ఉన్న అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఇంట్లోనే ఓ వ్యక్తి మృతి

లక్ష్మీపురం: ఓ ఇంట్లోనే వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యం శుక్రవారం వెలుగు చూసింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. కళాకారుల కాలనీకి చెందిన కట్టా మహేష్(45) ఆటో డ్రైవర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే తొమ్మిదేళ్ల కిందట భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య, పిల్లలు వేరేగా ఉంటున్నారు. పిల్లలు గుర్తుకు వచ్చినప్పుడు మహేష్ వెళ్లిచూసుకోని వారి బాగోగులు చూసుకుని వస్తుంటాడు. అయితే శుక్రవారం స్థానికులు కట్టా మహేష్ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుందని అరండల్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించగా మహేష్ మంచం పై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మూడు రోజుల క్రితం ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకున్న మహేష్ బయటకు రాలేదని, అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేసి కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు.

భూసార శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నారాయణ భరత్ గుప్తా, జయ ప్రదీప్ సుబ్రమణియన్, రత్తయ్య తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ పంట భూముల ఆరోగ్య స్థితిని అర్థం చేసుకునేందుకు భూసార పరీక్షలు ఎంతో కీలకమని, రైతులకు అవగాహన కల్పించేందుకు ఏరీస్ అగ్రో లిమిటెడ్ సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రదీప్ సుబ్రమణియన్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఐఏఎస్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా చేతుల మీదుగా శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ భరత్ గుప్తా మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు యువతను వ్యవసాయ రంగానికి మరింత దగ్గర చేస్తాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం జయ ప్రదీప్ సుబ్రమణియన్ మాట్లాడుతూ భూమి ఆరోగ్యం గర్తించడమే నేటి ప్రధాన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏరీస్ అగ్రో సంస్థ ఇన్‌చార్జి ఎన్‌వీ రత్తయ్య, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న కుమారి పాల్గొన్నారు.

రజకులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కరపత్రాలను ఆవిష్కరించిన రజక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు

లక్ష్మీపురం: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో సంఘ నాయకులు బెండమూరి లంక కైలాసం అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024 ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం రజకుల అభివృద్ధి- సంక్షేమ కార్పొరేషన్‌కు విధి, విధానాలు రూపొందించి రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులను ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. రజక లాండ్రీ వృత్తిదారులకు నెలకు 250 యూనిట్లు కరెంటు ఉచితంగా సప్లై చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి బొజ్జ సుబ్బారావు మాట్లాడుతూ రజకులకు నివాస స్థలాలు కేటాయించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అర్హులైన జాబితాను తయారుచేసి ఇవ్వడమైనదన్నారు. వెంటనే స్పందించి అర్హులైన రజకులకు ఇంటి స్థలాలు కేటాయించి నివాసగృహాలు నిర్మించడంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం సంఘ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మందూరు వెంకట నరసయ్య, నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బెండమూరి లంక కైలాసం, పేరుపాలెం రాంబాబు, అద్దంకి సాంబశివరావు, సత్తెనపల్లి శ్రీనివాసరావు, బెండమూరి లంక సుబ్రహ్మణ్యం, లంక శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, కే నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. జరుగుల బంగారు బాబు, శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి మాట్లాడుతూ మానవ జీవితంలో మంచి, చెడుల మధ్య పోరాటాన్ని, దేవుడ్ని చేరుకునేందుకు దైవిక లక్షణాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దైవిక లక్షణాలను అలవరచుకోవడం వలన ఒక వ్యక్తి ఆధ్యాత్మిక ఉన్నతిని సాధిస్తాడని అన్నారు. అసుర లక్షణాలను విడిచిపెట్టడం ద్వారా బంధ విముక్తిని పొందుతాడని భగవద్గీతలోని 16వ అధ్యాయం బోధిస్తుందని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశించారని పేర్కొన్నారు.